క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు ఇప్పించండి

భైంసారూరల్: మండలంలోని కథ్‌గాం గ్రామ పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి ఆ గ్రామ మాజీ సర్పంచ్ రాజు వినతిపత్రం అందించారు. పంచాయతీ భవనం, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర పనులకు సంబంధించి రూ.60 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రెండేళ్లుగా బిల్లులు రాక తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టాల్సి వస్తోందని వాపోయారు.

22న రైతుధర్నా

ఖానాపూర్: షరతులు లేకుండా రైతులకు రుణాలను మాఫీ చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 22న అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టే ధర్నాలో పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొనాలని కోరారు.

సాఠే అడుగుజాడల్లో నడవాలి



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు

భైంసారూరల్: ప్రతి ఒక్కరూ సాహిత్యరత్న అన్నాభావుసాఠే అడుగుజాడల్లో నడవాలని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. మంగళవారం మండలంలోని వానల్‌పాడ్‌లో అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన జెండా ఆవిష్కరించి సాఠే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాలోడ్ శ్రీనివాస్, రాంకుమార్, గంగాధర్, సచిన్, రాజు, సొలంకి భీంరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చెక్కు అందించిన ఎస్పీ

నిర్మల్‌టౌన్: పట్టణంలోని గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడైన పడిగెల అరుణ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈసందర్భంగా మంగళవారం నిర్మల్‌లోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో గాయత్రి బ్యాంక్ సేవింగ్ ఖాతాపై ఉన్న ప్రమాద బీమా రూ.1 లక్ష చెక్కును ఎస్పీ జానకీ షర్మిల.. అరుణ్ తల్లి పద్మకు అందజేశారు. బ్యాంక్ ఇన్‌చార్జి సీహెచ్ స్వాతి, సీనియర్ ఆఫీసర్ రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ఖానాపూర్: కూకట్‌పల్లి కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న సంతోష్‌పై దాడి చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఖానాపూర్ పట్టణ న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. వెంకట్ మహేంద్ర, రాజశేఖర్, శివ, వేణు, రవి, పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని ధర్మోర గ్రామానికి చెందిన రైజబేగంకు రూ.12వేలు, గంగవ్వకు రూ.11వేలు, పుష్పలకు రూ.11 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. మంగళవారం బీజేపీ నాయకులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులు అందజేశారు. మామిడి సంజీవ్‌రెడ్డి, మంద భాస్కర్, సునీల్‌రెడ్డి, సాహెందర్, ఆజోబ పటేల్ ఉన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి రైతువేదికలో మంగళవారం కోలాం, తోటి(పీవీటీజీ) గిరిజనులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన 12 రకాల కూరగాయల విత్తనాలను ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు రైతులకు పంపిణీ చేశామని ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి సందీప్ తెలిపారు. ఐటీడీఏ సిబ్బంది శ్యామల, గంగాధర్, మారుతి, నాయకులు గుమ్ముల రమేశ్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

తానూరు: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఎంపీడీవో అబ్దుల్ సమద్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించడంతోపాటు ఆవరణలో మురికి గుంతలను పూడ్చివేయాలని ప్రిన్సిపాల్ మురళికి సూచించారు.

పెంబి: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని కోసగుట్ట ఆశ్రమోన్నత పాఠశాల(బాలుర)ను సందర్శించారు. వంటగదిలో సామగ్రిని పరిశీలించి మాట్లాడారు. వంట గది శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ లచ్చిరాం, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రావు, ఉపాధ్యాయుడు కేశవరావు సిబ్బంది ఉన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



కడెంలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



ఖానాపూర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలోనే దేశంలో సాంకేతిక విప్లవం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దయానంద్, నిమ్మల రమేశ్, పార్టీ మండల కార్యదర్శి షబ్బీర్‌పాషా, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. పతంగి కిషన్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, అజీజ్, దిగంబర్, ఖలీద్ పటేల్, పోతారెడ్డి, ఆయాజ్, నజీమ్, బాబుబై, అనీజుద్దీన్, గోవింద్‌పటేల్, వెంకటేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, సాంకేతిక విప్లవానికి కృషి చేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. వాజీద్‌ఖాన్, భూషణ్, రమేశ్, రహీం, భూమన్న, బ్రహ్మచారి తదితరులున్నారు.



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ ముధోల్ ఇన్‌చార్జి ఆలూరి ప్రశాంత్, సద్దాం హుస్సేన్, పెంట శ్రావణ్, దశరథ్, మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మణీయమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నివాసంలో రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంబడి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కొట్టే శేఖర్, నాందేడపు చిన్ను, తదితరులు పాల్గొన్నారు.



దస్తురాబాద్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు సుగుణ

దస్తురాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేవని కాంగ్రెస్ నాయకురాలు సుగుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించారని కొనియాడారు.

‘ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు అన్యాయం’

కుంటాల: ఎస్సీ వర్గీకరణతో ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని.. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం భారత్‌బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. భారత్ బంద్‌కు వ్యాపార, వాణిజ్య, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ప్రైవేట్, పాఠశాలలు సహకరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ నరేశ్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ మగ్గిడి దిగంబర్, ఉపాధ్యక్షుడు మట్ట దిగంబర్, రాజ్‌కుమార్, జగదీశ్, రవిప్రసాద్, ముద్దం భోజన్న, గంగాధర్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు భీంరావ్ డోంగ్రే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు లోకేశ్వరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. సమితి లోకేశ్వరం అధ్యక్షుడు మాదరి ఆంజనేయులు, నాయకులు విఠల్ కాంబ్లే, మోడం శంకర్, ప్రభాకర్, శ్రీనివాస్, దేవిదాస్, దండే రమేశ్, దిగంబర్, చంద్రశేఖర్, గంగన్న ఉన్నారు.



లోకేశ్వరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

నేడు భారత బంద్

లోకేశ్వరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ బుధవారం భారత్‌బంద్ పాటించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండలాధ్యక్షుడు ఆంజనేయులు ప్రకటనలో తెలిపారు.

భైంసాటౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం భారత్‌బంద్ చేపట్టనున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ముధోల్ నాయకులు తెలిపారు. ఈమేరకు మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశమై మాట్లాడారు. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు బంద్ పాటించాలని కోరారు. సమావేశంలో సమితి తాలూకా అధ్యక్షుడు భీంరావు డోంగ్రే, ఉపాధ్యక్షులు లక్ష్మణ్, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు భీంరావు పవార్, చాకేటి లస్మన్న, సభ్యులు యశ్వంత్, రమేశ్‌బాబు ఉన్నారు.

తానూరు: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని నాయకులు భీమ్‌పవార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతువేదికల్లో దరఖాస్తుల స్వీకరణ

దస్తురాబాద్: రుణం మాఫీ కాని అర్హులైన రైతులు ఫిర్యాదుల కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈవోలు తిరుపతి, కిరణ్ కోరారు. మంగళవారం దస్తురాబాద్ రైతువేదికలో పలువురి రైతుల నుంచి రుణమాఫీ దరఖాస్తులను స్వీకరించారు. దస్తురాబాద్, రేవోజీపేట క్లస్టర్ల పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీ ప్రజాఫిర్యాదుల విభాగంలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మండల రుణమాఫీ నోడల్ అధికారి భూమేశ్ మాట్లాడుతూ ఆధార్ తప్పుగా ఉన్న రైతులు 12మంది, రేషన్ కార్డు లేనివారు 40 మంది, పట్టాదారు పాస్‌పుస్తకం లేనివారు ఎనిమిది మంది, ఆధార్, బ్యాంకుల్లో తప్పులున్నవారు 45 మంది, ఇతరులు 10 మంది.. మొత్తం 115 మంది రైతులు రుణమాఫీ కాలేదని దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఏఈవోలు మౌనిక, లావణ్య, మౌనిక, ఉమేశ్ ఉన్నారు.

సోన్: రుణమాఫీ కాని రైతులు రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుఫారం, పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్, రుణం తీసుకున్న బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌లతో రావాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉమామహేశ్వర్, ప్రగతి తదితరులు పాల్గొన్నారు.



సోన్ రైతువేదికలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఏఓ వినోద్, సిబ్బంది



లక్ష్మణచాందలో..

పెంబి: మండల కేంద్రంలోని రైతువేదికలో ఏఈవో రాజ్‌కుమార్ రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. సాంకేతిక కారణాలతో జరిగిన పొరపాట్లు సరిచేస్తామని ఏఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని రైతువేదికలో రుణమాఫీ కానీ రైతుల నుంచి ఏఈఓలు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవోలు పవిత్ర, సుస్మిత పాల్గొన్నారు.

కుంటాల: ప్రభుత్వం అర్హులైన వారికి రూ.రెండు లక్షల రుణం మాఫీ చేస్తుందని.. అధైర్య పడవద్దని ఏపీసీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపి భరోసా ఇచ్చారు. మంగళవారం రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో మాట్లాడారు. రుణమాఫీపై ఆయా మండలాల్లో దరఖాస్తుల విభాగం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో అసం రవి, ఏఈవోలు గణేశ్, శ్రీనివాస్, హర్షిత, పవన్ పాల్గొన్నారు.



లోకేశ్వరంలో దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారి

సంక్షిప్త వార్తలు

వినతిపత్రం అందజేత

మామడ: తాము నివాసం ఉంటున్న భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారని.. తమకు న్యాయం చేయాలని మండలంలోని తోటిగూడ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టాను రద్దు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. పలువురు గ్రామస్తులు తొడసం కాంతరావు, ఆత్రం భీంరావ్, చాకటి రేణుక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

కుంటాల: మండలంలో వ్యవసాయాధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భైంసా ఏవోగా పని చేస్తున్న అసం రవి కుంటాల ఇన్‌చార్జి ఏవోగా, నిర్మల్ మండలం చిట్యాల ఏఈవోగా పని చేసిన హర్షిత కుంటాలకు, మామడ మండలం తాండ్ర ఏఈవోగా పని చేసిన పవన్ సూర్యాపూర్‌కు, సారంగాపూర్ మండలం ఆలూరులో పని చేసిన శ్రీనివాస్ ఓలాకు బదిలీపై వచ్చారు.

నియామకం

ఖానాపూర్: బీజేపీ సభ్యత్వ నమోదు అసెంబ్లీ కన్వీనర్‌గా ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పార్టీ జిల్లా కన్వీనర్ సామ రాజేశ్వర్ రెడ్డి, ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఆకుల శ్రీనివాస్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సెప్టెంబర్‌లో సభ్యత్వ నమోదుచేపడతామని శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపేందర్, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

దస్తురాబాద్: మండలంలోని మున్యాల, దస్తురాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలల్లోని 157 మందికి పరీక్షలు చేసి 26 మంది విద్యార్థులకు కంటిఅద్దాలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యనిపుణుడు రాంరెడ్డి, వైద్యులు నాగరాజు, సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న ముధోల్ ఎంఈవో

ముధోల్: నాణ్యమైన విద్య అందించడానికి పలు జిల్లాల డీఈవోలు, ఎంఈవోలు, ఎంఎస్‌వోలకు మంగళవారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణ హైదరాబాద్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్సు(వీసీ) నిర్వహించారు. మండల ఎంఈవో సుభాష్ ఈ కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. నాణ్యమైన విద్య అందించడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలపై అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా గౌతమ్

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మంగళవారం గౌతమ్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన తుకారం నిర్మల్‌లోని బాలుర కళాశాలకు బదిలీపై వెళ్లారు. తుకారాంతోపాటు అధ్యాపకుడు భోజారాంను ఘనంగా శాలువాతో సన్మానించారు. అధ్యాపకులు చిన్నయ్య, వినోద్, విఠల్, శ్రీనివాస్ ఉన్నారు.

నేడు ప్రజావేదిక

నర్సాపూర్(జి): మండలంలోని గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై మూడో విడత సామాజిక తనిఖీ, నివేదికలు సమర్పించుటకు ప్రజావేదిక కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పుష్పలత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హుస్సేన్‌కు సన్మానం

కుంటాల:మండలంలోని ఓలా గ్రామానికి చెందిన హుస్సేన్ ఖానాపూర్‌లో డీటీపీ గా పని చేస్తూ ఇటీవల ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఆయనను మంగళవారం ఓలాలో గ్రామస్తులు సన్మానించారు. మహేందర్, శంకర్ పాల్గొన్నారు.

రేపటి సభకు తరలిరావాలి

ఖానాపూర్: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో ఈనెల 22న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగసభ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడారు. ఎన్నికల వేళ ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు రేషన్‌కార్డులు, ఇంటిస్థలాలు, ఇళ్లు ఇవ్వాలన్నారు. రైతు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. అంకుశ్‌రావు, రాజన్న, ఎల్లయ్య, శ్రీనివాస్, లచ్చన్న, ప్రభాకర్, భాస్కర్, రమేశ్ తదితరులు ఉన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలి

కుంటాల: పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఓటరు జాబితా పరిశీలించారు. జాబితాలో తప్పొప్పులు సరిచేయాలని ఆదేశించారు.

లక్ష్మణచాంద: ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణ కోసం ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు తహసీల్దార్ జానకి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాబితాలో మార్పులు, చేర్పులతోపాటు 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు ఓటరుగా దరఖాస్తు చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో, ఎంపీఓ అమీర్‌ఖాన్‌, సూపర్‌వైజర్లు నరేందర్ రెడ్డి, మహేందర్, నరేశ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పొరపాట్లు ఉంటే సరిచేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ వాహీదొద్దీన్, ఆర్‌ఐలు వేణుగోపాల్, సుమలత, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ఉత్తరాలు రాసిన విద్యార్థులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం గరిపెల్లి ట్రస్ట్, పత్తిపాక ఫౌండేషన్ సంయుక్తంగా ఆధ్వర్యంలో విద్యార్థులతో అవ్వ తాతలకు, ఉత్తరాలు రాయించి పోస్టు చేసినట్లు తెలుగు ఉపాధ్యాయుడు, కార్యశాల కన్వీనర్ కొండూరి పోతన్న తెలిపారు. లేఖ రచనలో మెలకువలు నేర్పి అవ్వ-తాతలకు ఉత్తరాలు రాద్దాం రండి కార్యక్రమంలో భాగంగా 50 మంది విద్యార్థులతో వారి నానమ్మ, అమ్మమ్మ తాతయ్యలకు ఉత్తరాలు రాయించినట్లు పేర్కొన్నారు. అనంతరం వాటిని పోస్టు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు నాలం విద్యాసాగర్ విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పోస్టాఫీసులో ఉత్తరాలు వేస్తున్న విద్యార్థులు

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

బాసర: మండలంలోని కౌట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజయ్య, గోవిందరాజు, గంగా కిషన్, రవీందర్, దేవిదాస్, శంకర్ పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఎస్ ఎస్ కాటన్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌కు పాఠశాలలు, కళాశాల విద్యార్థినులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, జిల్లా హాస్టల్ కన్వీనర్ సాయినాథ్, భైంసా నగర కార్యదర్శి సాయికిరణ్, చంద్రకాంత్, సందీప్, స్వాతిక, భవాని, ధరణి, పూజ, శృతిక పాల్గొన్నారు.



బాసర: రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

అందరూ పరిశుభ్రత పాటించాలి

తానూరు: రోగాల బారిన పడకుండా అందరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీవో నసీరుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని హిప్నెల్లి గ్రామంలో డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పాతటైర్లు, పాత్రల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దత్తారెడ్డి, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తానూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి పరిశుభ్రతపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ మాట్లాడారు. మురికి కాలువలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలన్నారు. వన మహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ సమద్, ఎంపీవో నసిరొద్దీన్ పాల్గొన్నారు.

కుంటాల: పల్లెల ప్రగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎల్‌పీవో సుదర్శన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు గ్రామంలో ఆయన పర్యటించారు. దోమలు వ్యాప్తి చెందకుండా మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి భోజన్న ఉన్నారు. డ్రైడేలో భాగంగా మంగళవారం కుంటాల మండలంలోని సూర్యాపూర్‌లో ప్రజలకు పరిశుభ్రతపై ఎంపీడీవో ఎంఏ రహీం అవగాహన కల్పించారు. కుండలు, టైర్లలో ఉన్న నిల్వనీటిని పారబోయించారు. పంచాయతీ కార్యదర్శి రాజు, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆశవర్కర్ ప్రతిభ తదితరులు ఉన్నారు.

‘ఎత్తిపోతల’లో అక్రమాలకు పాల్పడొద్దు

లోకేశ్వరం: ఎత్తిపోతల పథకం లావాదేవీల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోపరేటివ్ క్లస్టర్ సహకార అధికారి జగదీశ్ అన్నారు. గడ్‌చాంద ఎత్తిపోతల పథకం నిర్వహణలో అక్రమాలు జరిగాయని కలెక్టరు, సహకార అధికారికి రైతులు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు మంగళవారం బహిరంగ విచారణ చేట్టారు. ఎత్తిపోతల పథకం లావాదేవీల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. ఇరిగేషన్ డీఈ అనిల్, ఏఈ శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఉన్నారు.



మాట్లాడుతున్న అధికారి జగదీశ్

విరాళాల సేకరణ

నిర్మల్‌ఖిల్లా: కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు సీపీఐ రాష్ట్రశాఖ పిలుపు మేరకు మంగళవారం నిర్మల్‌లో జిల్లాశాఖ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. విరాళాలను కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని సీపీఐ జిల్లా నాయకులు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ కార్యవర్గ సభ్యులు భూక్య రమేశ్, కోకన్వీనర్ దుర్గ అనంతరావు, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు రాథోడ్ కుండలిక్, రాథోడ్ బలరాం తదితరులు పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

పూజలు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ పురాతన శ్రీ రాజ రాజేశ్వరాలయంలో ఎస్సై రజినీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకం, అలంకరణ చేశారు. అనంతరం గ్రామస్తులు సన్మానించారు.